# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 13, జనవరి 2026





## కోడిపందాలు, పేకాటలపై
# పటిష్ట నిఘా

★ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

★ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల, జనవరి 12, ప్రభాతవార్త

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పేకాట,కోడిపందాలు, ఇతర చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు, నాకాబందీలు నిర్వహించడంతో పాటు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన కీలక ప్రదేశాలలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కమిషనరేట్ సరిహద్దు జిల్లాలు మరియు ఇతర రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్‌లతో సమన్వయం ఏర్పాటుచేసి సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేకాట, కోడిపందాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను ఆయన కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

* ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:

నేటి పోటీ ప్రపంచంలో యువత మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ భవనంలో ఐటిఈఅండ్‌సి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టిఏఎస్‌కే) నూతన శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో ఖిటాస్క్ఖి (టిఏఎస్‌కే) ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, నిరుద్యోగులకు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన టెక్నికల్, నాన్‌టెక్నికల్ కోర్సులలో ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందని, అలాగే, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా, ఎస్బిఐ ఆర్ఏం రామచంద్ర రావు, ఎల్డియం ఉత్పల్ కుమార్, టాస్క్ అధికారులు శ్రీకాంత్ సిన్హా, రాఘవేందర్ రెడ్డి, సాయీన్ రెడ్డి, బోధన సిబ్బంది, ఇతర అధికారులు, యువతీ యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

ఆసిఫాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడా సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ లతో కలిసి హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతీయ ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన గురువని, తన ఉపన్యాసాలతో జగతిని జాగృతం చేసిన మహా మేధావి అని తెలిపారు. ఖగసత్యమే నా దైవం విశ్వమే నా దేశంగగ అని నమ్మి బానిసత్వంలో మగ్గిపోతున్న దేశ ప్రజలను మేల్కొలిపి సామాజిక అసమానతలపై శంఖం పూరించారని తెలిపారు. యువత తమ శక్తిని సమాజ హితానికి వినియోగించి దేశభక్తి, సేవా భావాన్ని విస్తరించాలని, దేశ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియలో బాల కార్మికులను వినియోగిస్తే
# కఠిన చర్యలు

✪ మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జనవరి 12, ప్రభాతవార్త

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో బాల కార్మికులను వినియోగిస్తే ఎన్నికల సంఘం, బాలల పరిరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడప్రతుల అతికింపు, ఫ్లెక్సీల ఏర్పాటు, కరపత్రాల పంపిణీ, ప్రచార సమయంలో ప్ల కార్డుల ప్రదర్శన, సభలలో, సమావేశాలలో బాలబాలికలచే పనులు చేపించినా, బాల కార్మికుల ప్రమేయం కనిపించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిబంధనలను అనుసరించి సజావుగా సాగేలా సహకరించాలని తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు
# ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

★ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

నస్పూర్, జనవరి 12, ప్రభాతవార్త



రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఫోటో ఓటరు జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన, మిగతా 2లో..



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఫోటో ఓటరు తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఈ నెల 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రకటన అనంతరం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలన, పరిష్కారం పిమ్మట ఈ నెల 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ ప్రచురణ కొరకు ప్రింటింగ్ ప్రెస్ లను గుర్తించడం వంటి పనులు పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ జారీ లోగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు మున్సిపాలిటీలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకటన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా, తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, సెక్టోరియల్ అధికారులు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో జనసేవాదళ్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిపిఐ నేతలు

## జనసేవాదళ్ శిక్షణ శిబిరం ప్రారంభం

### - ఖమ్మం కవాతును విజయవంతం చేయాలి: సిపిఐ పిలుపు

నస్పూర్, జనవరి 12, ప్రభాతవార్త

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా సమితి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జిల్లా స్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభ, పదివేల మందితో చేపట్టే కవాతును విజయవంతం చేయడం కోసం ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర జనసేవాదళ్ శిక్షకులు గోశిక మోహన్‌తో కలిసి ఆయన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 1964లో చంద్రా రాజేశ్వరరావు నాయకత్వంలో ప్రజలకు సేవ చేయడానికి, పార్టీ శ్రేణులను రక్షించడానికి జనసేవాదళ్ ఏర్పాటైందని కలవేన శంకర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆనాటి స్ఫూర్తితోనే నేడు కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి పునరంకితం కావాలని ఆయన సూచించారు. ఖమ్మం సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ బలాన్ని చాటాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ప్రజా సంఘాలు జనసేవాదళ్‌ను మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని నేతలు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, కె. వీరభద్రయ్య పాల్గొన్నారు. నాయకులు దాగం మల్లేష్, కలిందర్ అలీ ఖాన్, చిప్ప నరసయ్య, ఇప్పకాయల లింగయ్య, కొంకుల రాజేష్, లింగం రవి తదితర పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## వీధి కుక్కల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి

మందమర్రి, జనవరి12, ప్రభాతవార్త

వీధి కుక్కల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నివారణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని మదర్ తెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవన్ కోరారు. సోమవారం స్థానిక మదర్ తెరిసా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వీధి కుక్కల దాడుల వల్ల ప్రజలు గాయాల పాలవుతున్నారని, రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చట్టబద్ధంగా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మందమర్రి పట్టణ వ్యాప్తంగా రహదారులపై, నివాస ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి, ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని వీధి కుక్కల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### - ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్

ఉట్నూర్,జనవరి 12, ప్రభాతవార్త :

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తాండూర్ మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బజారత్నూర్ మండల కేంద్రానికి చెందిన సిడం సుధాకర్ తన వ్యవసాయం పైప్ లోన్ అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట్ మండలం రెగులగూడ గ్రామానికి ప్రళయ తన బి యాస్ సి నర్సింగ్ చదువు కొరకు ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో ఎంఆర్ఐ కేంద్రం ఏర్పాటు చేయాలి

### - వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆమ్ ఆద్మీ పార్టీ వినతి



వినతి పత్రం అందజేస్తున్న నహీం పాషా

నస్పూర్, జనవరి 12, ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఎంఆర్ఐ స్కానింగ్ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నహీం పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో అత్యాధునిక స్కానింగ్ సౌకర్యాలు లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. మంచిర్యాల జిల్లా ప్రజలు ఎంఆర్ఐ పరీక్షల కోసం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల రోగులు శారీరక శ్రమకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు కేంద్రాల్లో స్కానింగ్ ఖర్చులు భరించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ సదుపాయం కల్పిస్తే ప్రజలకు సకాలంలో వైద్యం అందుతుందని అభిప్రాయపడ్డారు. వెంటనే ఎంఆర్ఐ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విన్నవించారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్ నగర్ పట్టణంలోని సంఘం బస్తికి చెందిన సాహన్ మహమ్మద్ తనకు ఆసరా పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం పార గ్రామానికి చెందిన ఆత్రం నిర్మల తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన రైతులు వట్టివాగు కాలువను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని, వాంకిడి మండలం నవేగాం సర్పంచ్ సుజాత తమ గ్రామానికి రహదారి మంజూరు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని, కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ గ్రామానికి చెందిన చంద్రకాంత మేస్త్రీ తనకు జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకం లో విస్తీర్ణము సవరణ చేయాలని, కాగజ్ నగర్ మండలం వంజరి గ్రామానికి చెందిన దుర్గం దశరథ్ తనకు బారేగూడ గ్రామ శివారులో గల పట్టా భూమి ఇతరుల పేరిట చూపిస్తుందని, సవరించాలని కోరుతూ పలువురు అర్జీ దారులు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వస్తున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు

**- సబ్ కలెక్టర్ మనోజ్**

**నస్పూర్, జనవరి 12, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో సత్వర చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దండేపల్లి మండలం పెద్ద పేట గ్రామానికి చెందిన అగిడి పవన్ నిర్మించుకున్న ఇంటికి ఇంటి నెంబర్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామపంచాయతీ కొత్తగూడెం లోని మొదటి వాడకు చెందిన కాలనీవాసులు తమ త్రాగునీటి అవసరాల కొరకు నూతన బోర్ వెల్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామానికి చెందిన పి. రవీందర్ తనకు గల భూమి రికార్డులలో తక్కువగా చూపుతుందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ వడుగుల శాంత తమ గ్రామంలో బంజరు దొడ్డి ఏర్పాటు కొరకు భూమిని కేటాయించాలని, గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ తన దరఖాస్తులు 2018-19, 2019-2020 సంవత్సరాలలో స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా నర్సరీలలో పెంచిన మొక్కలకు సంబంధించి డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అనంతరం స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, జిల్లా విద్యాధికారి యాదయ్య, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మనిషి విజ్ఞానంతో పాటు విలువలతో ఎదగాలని బోధించిన మహనీయుడు అని, యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని నాటారని అన్నారు. లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని సాధించే వరకు ఆగకండి అని చెప్పిన వివేకానంద సందేశం నేటి యువతకు మార్గదర్శకమని తెలిపారు. యువత తమ శక్తిని సమాజ హితానికి వినియోగించి, ఉత్తమమైన మనసు, దృఢ సంకల్పం, సేవా ధృక్పథంతో యువత దేశాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో మానసికోల్లాసం

**వేమనపల్లి, జనవరి 12, ప్రభాతవార్త**

క్రీడలతో మానసిక ఉల్లాసం ఉంటుందని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని ముల్కలపేట గ్రామ పంచాయితీలో మండల స్థాయి క్రికేట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలు యువత మానసికోల్లసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని కోరారు. ఇట్టి టోర్నమెంట్‌లో 24 టీమ్‌లు తలబడనున్నాయి అని, వచ్చే క్రీడాకారుల కోసం వసతులు కల్పించడం జరిగిందని, మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలు గెలిచిన వారికి ఇవ్వడం జరుగుతుందని ఆర్గనైజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోర్కుటి నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



## టైక్వాండోలో మెడల్స్ సాధించిన బెల్లంపల్లి రైల్వే ఇన్స్టిట్యూట్ చెందిన విద్యార్థులు

**- మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించిన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్**

**బెల్లంపల్లి, జనవరి 12, ప్రభాతవార్త**

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని తలారి మాత్ స్టేడియంలో నిర్వహించిన మహంకాళి టైక్వాండో నేషనల్ ఛాంపియన్షిప్‌లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వే ఇన్స్టిట్యూట్‌కి చెందిన తైక్వాండో విద్యార్థులు పాల్గొని సిల్వర్ మెడల్స్ సాధించారు. టైక్వాండో మెడల్స్ సాధించిన ప్రమోద్ కుమార్, జి. శ్రేనిత్ సాయి లను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, రైల్వే ఏడిఈన్ గోపి, టైక్వాండో రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి అభినందించారు. అలాగే వీరికి శిక్షణ ఇచ్చిన జై అజయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## బొగ్గు నాణ్యతతోనే సంస్థ మనుగడ: జీఎం వీరభద్రరావు

**- ఆర్.కె-7 గ్రూపు గనుల అధికారులతో క్వాలిటీపై సమీక్ష**

**నస్పూర్, జనవరి 12, ప్రభాతవార్త**

గనుల నుంచి వెలికితీసే బొగ్గులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే సింగరేణి సంస్థ మనుగడ సాధ్యమవుతుందని బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్రరావు స్పష్టం చేశారు. సోమవారం ఆర్.కె-7 గ్రూపు ఏజెంట్ కార్యాలయంలో ఆర్.కె-7, ఆర్.కె-న్యూటెక్ గనుల అధికారులతో బొగ్గు నాణ్యతపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గనులకు సంబంధించిన ఉత్పత్తి వివరాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నేటి పోటీ ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని పేర్కొన్నారు. బొగ్గు వెలికితీత సమయంలోనే నాణ్యత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడితే సంస్థ భవిష్యత్తుకే ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్, మేనేజర్లు జె. తిరుపతి, కె. శ్రీనివాసు, రక్షణాధికారులు ఇ. సంతోషరావు, కె. రమేష్, క్వాలిటీ అధికారులు జగదీశ్వర్ రావు, పరమేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.






## వార్త పత్రికలు ప్రజాస్వామ్యానికి దిశానిర్దేశకాలు

**మందమర్రి, జనవరి 12, ప్రభాతవార్త**

మందమర్రి మండలం తహసిల్దార్ సతీష్ కుమార్ చేతుల మీదుగా జాతీయ తెలుగు దినపత్రిక వార్త క్యాలెండర్‌ను సోమవారం రోజున మందమర్రి తహసిల్దార్ కార్యాలయం నందు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేస్తూ, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించడంలో వార్త దినపత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిజానిజాలను నిష్పక్షపాతంగా ప్రచురిస్తూ ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తున్నాయి. ప్రజల సమస్యలకు వేదికగా నిలుస్తూ, సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి.

## యువత క్రీడల్లో రాణించాలి

**వేమనపల్లి, జనవరి 12, ప్రభాతవార్త**

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి కోరారు. నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న యువతను క్రీడల వైపు ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెడ్ కానిస్టేబుల్ ఎబినైజర్ యువతకు క్రికెట్ బ్యాట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం కూడా పెరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ యువత అభివృద్ధి, సమాజ హితం కోసం ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అభిషేక్ పాల్గొన్నారు.





## ఉట్నూర్ వాసికి ప్రేరణ పూరస్కర్ అవార్డు

**ఉట్నూర్, జనవరి 12, ప్రభాతవార్త :**

మండలంలోని సేవాదాస్ నగర్ వాసి ఇందల సింగ్ కు రాష్టియ సంత్ శ్రీ రామారావు మహారాజ్ ప్రేరణ పురస్కర అవార్డు లభించింది. బంజారా ఆధ్యాత్మిక గురువు శేఖర్ మహారాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సోమవారం అయన మాట్లాడుతూ బంజారాల సాంస్కృతిక సంప్రదాయాలు వారి జీవితంపై సాహిత్యం రచనలో విశేష కృషి వాళ్లే ఈ అవార్డు లభించిందన్నారు. బంజారా లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, లంబాడిలా ఐక్యవేదిక, సేవాలాల్ సేనా, బంజారా సేనా, గోర్ సేనా తరుపున కూడా ఇందల సింగ్ కి శుభాకాంక్షలు తెలిపారు.




## టీటీఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, జనవరి 12, ప్రభాతవార్త :**

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సోమవారం గిరిజన ఉపాధ్యాయ సంఘం టీటీఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం లో టీటీఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్, జిల్లా అధ్యక్షులు జాదవ్ రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ పర్యటన

రామకృష్ణాపూర్, జనవరి 12,ప్రభాతవార్త

కార్మిక,ఉపాధి కల్పన, భూ గర్భ గనులు శాఖ మంత్రి డా. జి.వివేక్ వెంకట స్వామి సోమవారం డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘు నాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజులతో కలిసి గద్దె రాగాడి, అమ్మ గార్డన్స్ ఏరియా, మల్లికార్జున నగర్‌లలో పర్యటించారు. స్థానిక వార్డ్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వార్డ్ సమస్యల గురించి మంత్రి దృష్టికి తీసుకోని రాగా సానుకూలంగా స్పందించారు. మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలవడనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. టికెట్లను ఆశిస్తున్న ఆశావాహులు కొంత హడావుడి చేశారు. అమ్మ గార్డెన్ రోడ్ నంబర్ కాలనీ వాసులు గత 15 యేండ్లుగా రోడ్ నిర్మాణం చేపట్టడం లేదనిఆవేదన వ్యక్తం చేశారు. స్వయాన మంత్రి వివేక్ కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించినప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్‌ల నిరక్ష్యంతో రోడ్ వేయడం లేదని మండి పడ్డారు. మంత్రి వివేక్ చొరవ తీసుకొని అమ్మ గార్డెన్ రోడ్ నంబర్ 2లో రోడ్ నిర్మించాలని కోరారు.




# ఉపాధి పనులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, జనవరి 12, ప్రభాతవార్త :

ప్రతీ ఒక్కరు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కిరణ్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎందా గ్రామపంచాయతిలో ఉపాధి హామీ పనులను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేరుగా నాకే సంప్రదించన్నారు. ఈ పనులలో ఫీల్డ్ ఆఫీసర్ రాథోడ్ మహేందర్, కూలీలు ఉన్నారు.

# క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ

వేమనపల్లి, జనవరి 12, ప్రభాతవార్త

సుంపుటం గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో సుంపుటం సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి జాజులపేట క్రీడాకారులకు సోమవారం క్రీడా దుస్తులు (జెర్సీ)పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దందెర మహేష్, కల్లంపల్లి సర్పంచ్ ఆలం లక్ష్మణ్, జాజులపేట యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.







# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన జర్నలిస్టులు

## - విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానాన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, జనవరి 12, ప్రభాతవార్త

ఇటీవల ఎన్ టీవీలో వచ్చిన కథనం పై బెల్లంపల్లి స్ట్రింగర్ అందుగుల రమేష్‌ను విచక్షణ రహితంగా దూషించిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ జెడ్పిటీసీ కార్కూరి రాంచందర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జర్నలిస్ట్‌లు సోమవారం రోజున బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాన్ని ముట్టడించారు. ఎఎంసి చౌరస్తా నుంచి క్యాంపు కార్యాలయం వరకు జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంట పాటు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడించారు. అయినా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బయటకు రాకపోవడంతో జర్నలిస్టులు క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాంజి ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే బయటికి రావాలని, రాంచందర్ ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో క్యాంప్ కార్యాలయం జర్నలిస్టుల నినాదాలతో హోరెత్తిపోయింది. పరిస్థితి ఉగ్రరూపం దాల్చడంతో బెల్లంపల్లి ఎసిపి ఏ. రవికుమార్, వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు వారి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిస్థితి చేయిజారుతుందనుకున్న ఎమ్మెల్యే చర్చించడానికి ఐదుగురు జర్నలిస్టులు లోపలికి పంపాలని అందుకు మధ్యవర్తులుగా కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల మల్లయ్య నాతరిస్వామి, మునిమంద రమేష్, చిలుముల శంకర్‌లు వచ్చి ఎమ్మెల్యే అయిదుగురిని క్యాంప్ ఆఫీసులకు రమ్మంటున్నారు. వచ్చి మాట్లాడండి అంటూ చెప్పగానే జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఎమ్మెల్యే నే బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఎమ్మెల్యే ఎట్టకేలకు బయటకు వచ్చారు. ఎమ్మెల్యే వినోద్ ప్రజాస్వామ్యం కావాలా మీకు లేక అప్రజాస్వామ్యం కావాలా నేను దేనికైనా సిద్ధమే మీరు చెప్పండి అంటూ జర్నలిస్టును ఎమ్మెల్యే ఎదురు ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కు జర్నలిస్టుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితులు ఉధృత్తంగా మారడంతో జర్నలిస్టులు ససేమీరా అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు రామచందర్ ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ వినతిపత్రం అని అందజేశారు. ఈ విషయంపై తగు విచారణ జరిపించి రాంచందర్ పై చర్యలు తీసుకుంటామని జర్నలిస్టులకు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి జర్నలిస్ట్‌లను పిలిపించుకుని తనపై వ్యక్తి గతంగా మనసును నొచ్చేలా, ప్రతిష్ట కు బంగం కలిగించేలా ఎన్ టీవీ ఛానల్ ప్రసారం చేసిన కథనంపై చట్టపరంగా ఎన్ టీవీ యాజమాన్యంపై పోరాడుతానని వారిని విడిచి పెట్టనని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటివి ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని లేదా తన పీఏలను జర్నలిస్ట్‌లు కలువాలని ఎమ్మెల్యే పేర్కొనడం కోసమెరుపు. ఈ ఆందోళన కార్యక్రమంలో టీ యూ డబ్ల్యూ జే జిల్లా ఉపాధ్యక్షుడు రవిరాజు, బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ పులియాల రాజు, ఉపాధ్యక్షులు కోల వెంకటేష్, పూదరి నగేష్ గౌడ్, తనుకు కృష్ణమూర్తి, శ్రీహరి, సంపత్ రెడ్డి, ఎస్ నారాయణ, బద్రి వెంకటేష్, వికాస్ యాదవ్, ముత్తె వెంకటేష్, వేముల వెంకటేష్, కొలిపాక శ్రీనివాస్, చింత పురుషోత్తం, బడుగు శ్రీనివాస్, కల్వల ప్రతాప్, దామెర విజయ్, తిరుపతి, సాలిగాం మల్లేష్, నగరం నిరంజన్, మేకల ప్రభాకర్, ఇందూరి తిరుపతి, నక్క సంతోష్, ఇరుకుల రమేష్, విజయ్, శేఖర్, సాయి, నామ్ రవీందర్, కొండు మల్లేష్, ఎనగందుల రాము, శ్రీకాంత్‌లతో పాటు బెల్లంపల్లి, తాండూరు, కాసిపేట, నెన్నెల, చెన్నూరు, భీమిని, కన్నెపల్లి ప్రాంతాల జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెరుందేవి తాయారు జ్ఞాపకార్థం అన్నదానం, చీరల పంపిణీ

## - ఘనంగా వివేకానంద 165 వ జయంతి ఉత్సవాలు

మందమర్రి, జనవరి 12, ప్రభాతవార్త

పంచముచ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు కృష్ణ చైతన్య ఆచార్య మాతృమూర్తి పెరుందేవి తాయారు 25వ వర్ధంతి జ్ఞాపకార్థం సందర్భంగా సివిక్ కాంట్రాక్టు కార్మికులకు చీరలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మందమరి పట్టణం పంచముచ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో సోమవారం అర్చకులు కృష్ణ చైతన్య నిర్వహించిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి, ఎంఆర్వో సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ, వివేకానంద జయంతి రోజు కృష్ణ చైతన్య తల్లి జ్ఞాపకార్థం మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేయడం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని యువతను సన్మార్గంలో పెట్టేందుకు వారు చేసే ప్రశంసనీయమన్నారు. యువత ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు అనంతచార్యులు, శంకర్రావు, టీం పంచముచ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# యువత చట్టాల పట్ల అవగాహన కల్గి ఉండాలి: ఎస్.ఐ భూమేష్

రామకృష్ణాపూర్, జనవరి 12, ప్రభాతవార్త

యువత భారత రాజ్యాంగం, చట్టాల పట్ల అవాగాహనా కల్గి ఉండాలని ఎస్.ఐ భూమేష్ అన్నారు. సోమవారం తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యువతకు సందేశాన్నిచ్చే వాల్‌పోస్టర్ ను సంఘం అధ్యక్షుడు, అడ్వాకెట్ మోతె రాజలింగు,సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, చట్టాల పట్ల అవగాహన కలిగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశ భవిష్యత్ మరింత బలంగా మారుతుందన్నారు.విద్య, విజ్ఞానం, సేవ, నాయకత్వం మొదలైన అంశాలపై దృష్టి సారించాలన్నారు. యువత మారితే సమాజం మారుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గొడిసెల రాజారాం, టీ.బీ.ఎస్.ఎస్ నాయకులు తుంగ వెంకటేష్, వైద్య శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి**






పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఎన్నికల నిర్వహణకు సంబందించిన పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఫోటో ఓటరు తుది జాబితా ప్రకటన, ఈ నెల 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రకటించడం, ఈ నెల 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించడం, ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ కొరకు ప్రింటింగ్ ప్రెస్ లను గుర్తించడం వంటి పనులు పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ జారీ చేసే లోగా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకటన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా, తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగా జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాల ఏర్పాటు, నోడల్ అధికారుల నియామకం, సెక్టోరియల్ అధికారులు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేసి మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద పూలమాలవేసి నివాళులు అర్పించిన దృశ్యం

## స్వామి వివేకానంద జీవిత చరిత్రను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, జనవరి 12, ప్రభాతవార్త**

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం మంచిర్యాల పట్టణం కాలేజ్ రోడ్ స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ స్వామి వివేకానందను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వారి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకొని వారి అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలు అన్ని తిరిగి భారత దేశ చరిత్రను చాటి చెప్పిన గొప్ప వ్యక్తి వివేకానంద అని తెలిపారు. ప్రతి ఒక్కరు వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, బియ్యాల సతీష్ రావు, ఆకుల అశోక్ వర్ధన్, తుల ఆంజనేయులు, అవిడపు రాజబాబు, బుద్దారపు రాజమోళి, బింగి సత్యనారాయణ, మెరెడికొండ శ్రీనివాస్, వెలుముల దుర్గా ప్రసాద్, కాశెట్టి నాగేశ్వర్ రావు, బూర్ల చిరంజీవి, బోయిని దేవేందర్, అరె సతీష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఊరికి వెళ్తున్నారా జర జాగ్రత్త...

**- బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు**

**బెల్లంపల్లి, జనవరి 12, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఒకటో పట్టణ సీఐ కే. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో మాట్లాడుతూ సంక్రాంతి సెలవు దృష్టిలో ఉంచుకొని, తమ సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు ఎవ్వరు కూడాను ఖరీదైన బంగారు ఆభరణాలను మరియు డబ్బులను ఇంట్లో ఉంచుకొని గ్రామాలకు ప్రయాణించకూడదన్నారు. బంగారు ఆభరణాలను అవసరమైతే బ్యాంకు లాకర్లో భద్రపరచుకోవాలన్నారు. తమ ఇంటిని విడిచి సొంత గ్రామాలకు ప్రయాణించే ముందు ఏ ఒక్క విలువైన వస్తువు ఇంట్లో ఉంచకుండా పగడ్బందీగా తాళాలు వేసుకొని వెళ్లాలన్నారు. తమ ఇంటి ఆవరణంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన, వారి ఇంట్లో దొంగతనం జరిగే అవకాశం ఉందని భావించిన, వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు. సెలవులకు వెళ్లే ప్రజలు వారు తమ ఇంటిని విడిచి వెళ్లే ముందు ఒకసారి తమ యొక్క బీట్ ఆఫీసర్ గానీ, పోలీస్ స్టేషన్లో గాని కలిసి వెళ్తే, పోలీసు వారు తమ ఇంటి ఆవరణంలో పెట్రోలింగ్ పెంచే అవకాశం అవకాశం ఉంటుంది కావున, దీనివల్ల దొంగతనాలు జరగకుండా ముందుగా జాగ్రత్త పడవచ్చునన్నారు. దొంగతనం జరిగినప్పుడు దొంగలను గుర్తించడంలో సీసీటీవీ కెమెరాలు చాలా దోహదపడతాయి. కావున ప్రజలందరూ కూడా తమ ఇంటి ఆవరణలో గల సీసీటీవీ కెమెరాలు సరిగ్గా పని చేస్తున్నావో లేదో చెక్ చేసుకోవాలని సూచించారు. తమ ఇంటి ఆవరణంలో, చుట్టు పక్కల ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసు వారికి పిర్యాదు చేయాలన్నరు. ఈ విధంగా పట్టణ ప్రజలందరూ కూడాను పోలీసు వారి సూచనలు క్రమం తప్పకుండా పాటిస్తూ, ఎలాంటి దొంగతనాలకు తావు ఇవ్వకుండా పోలీసు వారికి సహకరించాలని సిఐ శ్రీనివాసరావు అన్నారు.



## వ్యవసాయ పథకాలకు రైతు గుర్తింపు నమోదు తప్పనిసరి

**రెబ్బెన, జనవరి 12, ప్రభాతవార్త:**

రైతుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం రైతువివరాలు ఆన్లైన్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల లబ్ధిసులభంగా పొందవచ్చని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిది పథకంకు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ కచ్చితంగా ఉండాలని తెలిపారు. పంటల బీమా, సబ్సిడీ పథకాలు, పంట రుణాలు ప్రభుత్వ పథకాలు తొందరగా రైతులకు అందేందుకు నమోదు. అవసరమన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీకి అనుసంధానం చేసే అవకాశం ఉందని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం రైతుల ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న మొబైల్ ఫోన్తో సంబందించిన క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ చేసే అవకాశం మీసేవ కేంద్రాలకు కూడా ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ ఆన్లైన్ నమోదు కొనసాగగా పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గంగాపూర్ సర్పంచ్ వెంకన్న, మండల వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, శివ, సుకన్య , కృపామణి, రైతులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

## పేద ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ఎమ్మెల్యే లక్ష్యం: కొక్కిరాల సురేఖ

**మంచిర్యాల, జనవరి 12, ప్రభాతవార్త**

మంచిర్యాల నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని వారి సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాస ప్రాంగణంలో మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డుల మహిళలకు ఆమె సంక్రాంతి కానుకగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత బతుకమ్మ పండుగ సమయంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం క్షీణించడంతో మహిళలకు చీరలు పంపిణీ చేయలేకపోయామని గుర్తు చేశారు. ప్రస్తుతం వారు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవడంతో, తన నియోజకవర్గంలోని అక్కాచెల్లెమ్మలందరికీ సంక్రాంతి కానుకగా చీరలు అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే కార్పొరేషన్ పరిధిలోని 10, 11, 25, 26, 27, 28, 29, 30, 34, 35, 36 వార్డులకు చెందిన వందలాది మంది మహిళలకు చీరలను పంపిణీ చేసినట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజలందరూ సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా విభాగం నాయకురాలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ఆయా వార్డుల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

## మాలమహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆసిఫాబాద్, జనవరి 12, ప్రభాతవార్త :**

జిల్లా మాల మహానాడు నూతన సంవత్సర క్యాలెండర్ ను జిల్లా అధ్యక్షులు దుంద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా మాల మహానాడు కార్యకలాపాలు భవిష్యత్ కార్యక్రమాలపై అధ్యక్షులు దుంద్ర శ్రీనివాస్, నాయకులు కలెక్టర్ కు వివరించారు. సమాజ అభివృద్ధికి సంఘాలు క్రియాశీలక పాత్ర పోషించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు బొడ్డు మోనిక, పురుషోత్తం, హన్మంతు, వెంకటి, సుధాకర్, నాగరాజు, కృష్ణ, ఎలామాద్రి మల్లేష్ ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

# యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలి

## ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



**నేరడిగొండ, జనవరి 12, ప్రభాతవార్త:**

యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. ఎన్‌టి రమణ అన్నారు. సోమవారం చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేరడిగొండ మండలంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. ఎన్‌టి రమణ మాట్లాడుతూ యువతకు స్వామి వివేకానంద జీవితం మార్గదర్శకమని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సేవాభావంతో ముందుకు సాగితే సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత సత్యనారాయణ, శ్రీను, శేఖర్, లోకేష్, మోహన్, డా. అమృత్ కుమార్ పాల్గొన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా భవిష్యత్తులో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చేయూత ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

**సిరికొండ, జనవరి 12, ప్రభాతవార్త:**

స్వామి వివేకానంద జయంతి వేడుకలను సిరికొండలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలు, బోధనలు స్మరించుకున్నారు. యువతకు వివేకానంద ఆలోచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల సర్పంచ్ బొడ్డు దత్తు, ఉప సర్పంచ్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

**బజార్‌హత్నూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

స్వామి వివేకానంద జీవితం మానవాళికి వెలుగు దీపమని బజార్‌హత్నూర్ సర్పంచ్ పరచ సాయన్న అన్నారు. మండల కేంద్రంలోని పలు గ్రామాలలో యువకులు, గ్రామస్థులు ఆధ్వర్యంలో సోమవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బజార్‌హత్నూర్ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ జ్ఞానం, కరుణ, కార్యాచరణలను సమన్వయంగా జీవించి చూపిన మహానుభావుడు ఆయన యువతను మేల్కొలిపి, సమాజాన్ని బలపరిచే మార్గాన్ని మానవాళికి అందించాడన్నారు. యువజన సంఘం అధ్యక్షుడు డబ్బుల చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ యువజన దినోత్సవానికి మూల ప్రేరణగా నిలిచిన ఆయన జీవితం, భారత దేశానికి గర్వకారణమని, ఆయన జీవితాన్ని ఆధ్యాత్మిక కోణంలో అర్థం చేసుకోవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని స్వామి వివేకానంద జీవితం ఒక సాధారణ సన్యాసి జీవితం కాదు, అది తీవ్రమైన ఆత్మాన్వేషణ, తపస్సు, అంతర్గత పోరాటం, చివరికి ఆత్మసాక్షాత్కారం వైపు సాగిన మహా సాధనా ఆయన ప్రయాణం అన్నారు. గ్రామ యువకులు పాల్గొని అంధ విశ్వాసాలను అంగీకరించని ఆయన, అనుభవ సిద్ధమైన సత్యమే నిజమని నమ్మారు. ఈ ప్రశ్నే ఆయనను గాఢమైన సాధనా మార్గంలో నడిపించిందన్నారు. ఈ విధంగా స్వామి వివేకానంద సాధనా జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఆయన సాధించిన ఆధ్యాత్మిక స్థితులు నేటికీ అనేక సాధకులకు ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొంగర్ల శారద రాజన్న, చట్ల వినీల్, చట్ల విలాస్, డబ్బుల రమణ, బత్తూరి రవి, రాములు, కర్వల గంగన్న, రాజు, గాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్, జనవరి 12, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో సోమవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని, యువభారత శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి గర్వంగా చాటిచెప్పిన మహనీయుడన్నారు. స్వామి వివేకానంద సనాతన ధర్మంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న భారతీయ సాంస్కృతిక వారసత్వపు సారాంశాన్ని గ్రహించి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని బలంగా విశ్వసించారని నేతలు గుర్తు చేశారు. ఆయన బోధనలు, వ్యక్తిత్వం భారతీయ యువతకు ఎప్పటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానందుల ఆదర్శాలు, సందేశాల స్ఫూర్తితో యువత వికసిత భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, నాయకులు చిలువేరు శేషగిరి, సిద్ధం మల్లేష్, పుట్ట కుమార్, రాచర్ల సురేష్, ఆసం అశోక్, కంబాల నర్సయ్య, బానయ్య, తదితరులు, పాల్గొన్నారు.

**ఉట్నూర్, జనవరి 12,ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని పలు గ్రామాలలో యువకులు, గ్రామస్థులు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించిన నాయకులు.సోమవారం నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ జ్ఞానం, కరుణ, కార్యాచరణ లను సమన్వయంగా జీవించి చూపిన మహానుభావుడలను యువతలు స్ఫూర్తి గా తీసుకోని ముందుకు కొనసాగాలన్నారు. సమాజాన్ని బలపరిచే మార్గాన్ని మానవాళికి అందించాడన్నారు. టీటీఫ్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జాదవ్ చంద్రకాంత్ మాట్లాడుతూ జాతీయ యువజన దినోత్సవానికి మూల ప్రేరణగా నిలిచిన ఆయన జీవితం, భారత దేశానికి గర్వకారణం. ఆయన జీవితాన్ని ఆధ్యాత్మిక కోణంలో అర్థం చేసుకోవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్ని అన్నారు. ఈ కార్యక్రమం లో హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీరామ్ నాయక్ గుగ్లోత్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, జనవరి 12, ప్రభాతవార్త**

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్రనాథ్ దత్త అని, 1863 జనవరి 12 నాడు కోల్ కత్తాలో జన్మించారాని, కేవలం 39 సంవత్సరాల ఆరు నెలలు జీవించారనీ, అంత తక్కువ వయోపరిమితిలో కూడా అనితర సాధ్యమైన పనులు నిర్వర్తించారానీ, ముఖ్యంగా దేశాలను పర్యటించడం, ప్రపంచానికి అంతటికీ భారతీయుల ఔన్నత్యాన్ని చాటిచెప్పడం అనేవి స్వామి వివేకానందలోనే చూడగలమనీ, స్వామి శిష్యులు సైతం భారతదేశానికి ఎంతో సేవచేశారానీ, స్వామి వివేకానందుల జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటామనీ, యుక్తవయస్సులోనే భారతీయ కీర్తిపతాకను ప్రపంచ వేదికపై రెపరెపలాడించిన గొప్ప మహనీయుడనీ, యువజనులలో స్ఫూర్తి నింపితే వారే దేశానికి వెలుగునిస్తారని నమ్మిన మానవతావాది. నేటికీ యువతరం హృదయాలలో ఆయన వ్యక్తిత్వం మహోన్నతంగా ప్రకాశిస్తూనే ఉంటుందనీ, వివేకానందుల జయంతి సందర్భంగా ఆయన సందేశాలు జ్ఞాపకం చేసుకొని ఆచరిద్దామనీ అన్నారు. ఆయన చేసిన అద్వైత వేదాంత ప్రబోధకమైన ఈ ప్రసంగం చదివితే యువజనుల్లో ఆయన రగిలించిన స్ఫూర్తి ఎలాంటిదో అర్ధమవుతుందని, మీ ఇంటి ప్రక్కన పేద ప్రజలెందరో ఉంటారని, కష్టాలమధ్య అల్లాడుతున్న వారి సహాయం చేయాలని, ఆకలితో అలమటించు వారికి అన్నం పెట్టండి అజ్ఞానులైన వారికి మీకు తెలిసిన మేరకు చదువు నేర్పండని అన్నారు.

**చింతలమానేపల్లి, జనవరి 12, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఆరెకుల సంఘం మండల అధ్యక్షుడు తొంబిరే శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి రాజమాత జిజియ బాయి జయంతి, స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరై, జిజియ బాయి, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజమాత జిజియ బాయి దేశానికి మహానాయకుడైన శివాజీ మహారాజును అందించారని, స్వామి వివేకానంద యువతకు మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. వారి ఆలోచనలు, ఆదర్శాలు యువత జీవితాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెకుల సంఘం పెద్దలు డుబ్బుల నానయ్య, వెంకయ్య, తోంబ్రే మారుతి, చౌదరి సంజీవ్, మేకల ప్రసాద్, సిడం గణపతి, యువకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





వివేకనంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పిస్తున్న హిందూ ఉత్సవ కమిటీ నాయకులు



జిజయ బాయి, వివేకానంద జయంతి వేడుకలు



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**ఆసిఫాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:**

స్వామి వివేకానంద బోధనలు మానవ సేవయే మాధవ సేవగా సాగాయని వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్ బాబు పేర్కొన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని స్థానిక వివేకానంద చౌక్ లో స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్యక్షుడు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే భగవత్ సాక్షాత్కారం కోసం తపించారని, ప్రపంచ మత సదస్సులో హిందూ ధర్మాన్ని గొప్పగా చాటిచెప్పారని గుర్తుచేశారు. రామకృష్ణ మిషన్ స్థాపించి యువతలో స్ఫూర్తి నింపారన్నారు. ఆయన చేసిన సేవలు, బోధనలు ప్రాచుర్యం పొందాయన్నారు. పశ్చిమ దేశాలకు వేదాంతం, యోగాను పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారని, ఆయన జన్మదినమైన జనవరి 12ను భారతదేశంలో జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అంతర్జాతీయ నాయకులు గంధం శ్రీనివాస్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు చిలివేరీ వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, క్లబ్ మాజీ అధ్యక్షులు పాత శ్రీనివాస్, కోడిప్యాక వేణుగోపాల్, విలాస్, ఆశిష్, ప్రశాంత్, వెంకన్న, ప్రవీణ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు. వివేకానంద సేవా సమితి, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో....వివేకానంద సేవా సమితి, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు నేర్పిన స్ఫూర్తిని, బోధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాంద్రే విశాల్, సంతోష్, అరిగేలా మల్లికార్జున్, గణేష్, దీపక్, వెంకన్న, ప్రతాప్, వారణాసి శ్రీనివాస్, అభయకుమార్, శివచరణ్, నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కార్మెల్ అకాడమీలో ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు

### - సంక్రాంతిని పురస్కరించుకొని రంగవల్లి పోటీలు

**మందమర్రి, జనవరి12, ప్రభాతవార్త**

2026 సంవత్సరానికి గాను కార్మెల్ అకాడమీలో వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మందమర్రి పట్టణంలోని కార్మెల్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్రీడోత్సవాలకు కార్మెల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ సిస్టర్ మారియా అగాస్టిన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 800, 400, 200 మీటర్ల పరుగు పందాలతో పాటు షార్ట్ ఫుట్ రిలే పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం 26 సెప్టెంబర్ 1998లో పీఈటీగా విధుల్లో చేరి విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతూ, మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయుడు కే. అమర్ ఈ విద్యా సంవత్సరంతో పదవీ విరమణ పొందనున్న సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, కిరీటం ధరింపజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫాదర్ జేవిఆర్ రెక్స్ మాట్లాడుతూ, కార్మెల్ వార్షిక క్రీడలు, సంక్రాంతి పండుగ వేడుకలు, పదవీ విరమణ సన్మానాలను సమన్వయపరిచి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందకరమని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరగాలంటే ఓటమిని కూడా స్వీకరించే మనోధైర్యం అవసరమని, గెలుపు కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, విధేయత, ఆటలు, పండుగల సంస్కృతి ద్వారా విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అనంతరం విద్యార్థుల తల్లుల కోసం రంగవల్లి (ముగ్గుల) పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి ప్రజా ప్రభుత్వమే బలమైన పునాది: ఎమ్మెల్సీ

**చింతలమానేపల్లి, జనవరి 12, ప్రభాతవార్త:**

చింతలమానేపల్లి మండలం గంగాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ భూమి పూజ కార్యక్రమం చేశారు. గ్రామ పరిపాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ తోనే సాధ్యమని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందాలంటే గ్రామస్థాయిలో బలమైన పరిపాలనా వ్యవస్థ అవసరమని అన్నారు. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. గంగాపూర్ గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు ఒకే చోట అన్ని పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని, ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బల్గురి అజయ్

## మొదటి గ్రామ సభ నిర్వహణ

**సారంగాపూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో స్థానిక ఎన్నికలు గెలిచి బాధ్యతలు చేపట్టి, మొదటి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బల్గురి అజయ్ మాట్లాడుతూ గ్రామ సభలో డిఆర్డిఓ నిధులతో వివో భవన నిర్మాణం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, మధు, ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజమాత జిజావుబాయి జయంతి వేడుకలు

**ఇచ్చోడ, జనవరి 12, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఆరే మరాఠి సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి రాజమాత జిజావుబాయి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జిజావుమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇచ్చోడ ఆరే మరాఠి సంఘం అధ్యక్షులు సాయికిరణ్ జాధవ్ మాట్లాడుతూ మాత జిజావు స్వరాజ్య సంకల్పాన్ని శివాజీ మహారాజ్‌లో ఉగ్గుపాలతో నింపిందని, శివాజీ మహారాజ్‌కు జిజావు మాత ఒక తల్లిగా మాత్రమే కాకుండా ఆమె ఒక గురువుగా, ఒక యోధురాలుగా, ఒక దార్శనికురాలుగా త్యాగం, ధైర్యం, ధర్మం, దేశభక్తి అనే విలువలు ఛత్రపతి శివాజీ మహారాజ్ హృదయంలో పసిప్రాయంలోనే నాటిందని తెలిపారు. ఇచ్చోడ ఆరే మరాఠి సంఘం జిజావుమాత ఆలోచనలనే ఆదర్శంగా తీసుకొని సంఘ ఐక్యత, సంస్కృతిక పరిరక్షణ, విద్యాభివృద్ధి, సమాజ సేవ అనే మార్గంలో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పాన్పట్టే సుభాష్, గౌరవ సలహాదారు డాక్టర్ దుక్రే మనోహర్ పాటిల్, కోశాధికారి లక్ష్మణ్, గైక్వాడ్ జ్ఞానేశ్వర్, దుక్రే బాబరావు, కదం చంద్రకాంత్, రాము జాధవ్, దినేష్ గైక్వాడ్, సందీప్ కదం, బాబూరావ్ సురోసే, శివకాంత్ కదం, సునీల్ గరడ్ తదితరులు పాల్గొన్నారు.



రాజమాత జిజావుబాయి చిత్రపటానికి నివాలర్పిస్తున్న నాయకులు

## కార్మిక కర్షక మైత్రికి కదలిరండి

**దిలావర్‌పూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

ఈనెల 19న జరిగే కార్మిక కర్షక మైత్రినీ జయప్రదం చేయాలని కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్ కుమార్ అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు రైతులకు నష్టం చేసేటువంటి కొత్త కొత్త చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. రైతులు చేసిన పోరాట ఫలితంగా కేంద్రంతోక ముడిసిందని తెలిపారు. కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో కూలీలకు నష్టం చేసే చర్యలు చేపడుతుందని తెలిపారు. మహాత్మా గాంధీ పేరుని తొలగించి విబిజి రామ్ జి అనే పేరును పెట్టిందని తెలిపారు. కార్మికులకు నష్టం చేసేటువంటి నాలుగు లేబర్ కోట్లను తెచ్చి కార్మికుల ఐక్యతను దెబ్బతీసిందని అన్నారు. 19న జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అవర్గ ముత్యం, విలాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్ కుమార్

## చైనా మాంజా దారం కాదు అది యమపాశం

### - ఎస్సై రవీందర్

**దిలావర్‌పూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

చైనా మాంజా దారం కాదు యమపాశం అని ఎస్ఐ రవీందర్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు దిలావర్‌పూర్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలోని దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గాలిపటాలకు కట్టి ఎగురవేసి దారాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చైనా మాంజా వంటి దారాలను వాడడం వల్ల దారుణమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. రోడ్డుకు అడ్డంగా పడిన ధారాల వల్ల వాహనదారుల తలలు తెగిపోయే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా మూగజీవాలు పక్షుల ప్రాణ నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. కావున ఎట్టి పరిస్థితులలో చైనా మాంజా విక్రయించవద్దని ఒకవేళ అలా ఎవరైనా విగ్రహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ఏఎస్ఐ భీమ్రావు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# 39 ఏళ్లుగా వైద్య సేవలు..

## కెరమెరి చెందిన జిల్లా ఫార్మాసిస్ట్ ఆఫీసర్ ఖలీల్‌కు ఘన సన్మానం - శాలువాతో సత్కరించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**కెరమెరి, జనవరి 12, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలానికి చెందిన జిల్లా ఫార్మాసిస్ట్ ఆఫీసర్ ఖలీల్ 39 ఏళ్లుగా ప్రజలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తూ సమాజానికి విశేష సేవలందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఖలీల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. 35ఏళ్ల క్రితం మండల కేంద్రంలో ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మాసిస్ట్ గా విధుల్లో చేరారు. గతేడాది జిల్లా ఫార్మాసి ఆఫీసర్ గా భూపాల్ పల్లి బదిలీ పై వెళ్లాగా .. డిప్యుటేషన్ పై సి ఎస్ సి ఆసిఫాబాద్ కు వచ్చారు. కెరమెరి మండల కేంద్రంలో ఉంటూ సామాజిక వైద్య సేవలు అందిస్తున్న సేవలపై డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడారు . కెరమెరి ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఖలీల్ పాత్ర అనిర్వచనీయమని అన్నారు. సుమారు 39ఏళ్లుగా మండలంలోని ప్రజలకు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండి, ఎప్పుడైనా అవసరమైతే మందులు అందిస్తూ సేవలందించడం ప్రశంసనీయం అని కొనియాడారు. ఏ సమయంలోనైనా సమాచారం అందిస్తే చాలు అనారోగ్యం తో ఉన్న వారికి చికిత్స అందించేందుకు ముందుకు వస్తారు. విధుల్లో ఉన్నా లేకున్నా రోగి వద్దకు వచ్చి వైద్య సేవలు అందించడంలో పేరు సంపాదించారని పేర్కొన్నారు. కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించిన ఆయన సేవలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఖలీల్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులు, ప్రేమాభిమానాలే తన సేవలకు ప్రేరణ అని చెప్పారు. భవిష్యత్తులో కూడా కెరమెరి ప్రజలకు ఇదే విధంగా వైద్య సేవలు కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జగన్నాథ్ రావు, కోవ ఇందిరా, సుజాయిత్ ఖాన్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, బాలాజీ, మహమ్మద్, ఆత్రం తిరుపతి, అయ్యుబ్ తదితరులు పాల్గొన్నారు. అభిమానులు పాల్గొని ఖలీల్‌ను అభినందించారు.



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**నార్నూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

ద్విచక్ర వాహన దారులు డ్రైవింగ్ సమయంలో రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై అఖిల్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ స్టేషన్ నుంచి మెన్ రోడ్డు గుండా గ్రామస్థులు, పోలీస్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోర్రల మహేందర్, రాజు నాయక్, సిబ్బంది నాగోరావ్, మోహన్ మరియు యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణం అందరి బాధ్యత

**సిరికొండ, జనవరి 12, ప్రభాతవార్త:**

సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సై పూజ అన్నారు. సోమవారం సిరికొండ మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పూజ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, వేగ నియంత్రణ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల సర్పంచ్ బొడ్డు దత్తు, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



## అంతక్రియల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

**ఇచ్చొడ, జనవరి 12, ప్రభాతవార్త:**

ఇచ్చొడ మండలం సిరిచేల్మా గ్రామానికి చెందిన తృప్తి జంగం మల్లేశయ్య మృతి చెందడంతో ఆయన అంతక్రియలు సోమవారం సిరిచేల్మాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ నాయకుడిని పరామర్శించిన ఆడే గజేందర్

**ఇచ్చోడ, జనవరి 12, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండలం నవేగం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఇంగోలే ప్రవీణ్ పెద్దమ్మ ఇంగోలే సావిత్రీబాయి మృతి చెందడంతో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆడే గజేందర్ వెంట మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, బోరిగాం సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుకారం, ఏక్‌నాథ్, ప్రవీణ్ రెడ్డి, జాహిద్, శివాజీ, బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం, సాయి ప్రసాద్, లక్ష్మణ్, పరమేశ్వర్, కేశవ్ కేంద్రీ, ఆనంద్ రావు, రామ్ లక్ష్మణ్, మోలానా, షఫీ హైమద్ తదితరులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి సహాయనిధిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి

**నేరడిగొండ, జనవరి 12, ప్రభాతవార్త:**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 16 మందికి రూ.4,45,500 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల వైద్య అవసరాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పత్తిరెడ్డి

## మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించిన పత్తిరెడ్డి

**సారంగాపూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి సోమవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సెలవులలో గ్రామాలకు వచ్చిన విద్యార్థులకు మానసిక ఉల్లాసం, తమ మండల స్థాయిలో ఉన్న విద్యార్థుల ఒకరికి, ఒకరు కమ్యూనికేషన్ భావజాలం ఏర్పడుతుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ అయిర నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, వాసవి పోతా రెడ్డి, అయిరరాజు రెడ్డి, పుంద్రు భీమ్ రెడ్డి, రవి, వివిధ గ్రామాల క్రీడాకారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## దేశి డీలర్ల ఉద్యాన ఉత్సవం సందర్శన

**దిలావర్‌పూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలానికి చెందిన దేశీ డీలర్లు ఉద్యాన ఉత్సవం, రాష్ట్రపతి నిలయంలో సందర్శించారు. ఉద్యానరంగంపై ఆసక్తి ఉత్సాహంని నింపేందుకు దేశీ ప్రోగ్రాం ఫెసిలిటర్ సౌజన్య, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. ఉద్యాన రంగానికి సంబంధించిన ఆధునిక పద్ధతులు అభివృద్ధి అవకాశాలు పర్యావరణ అనుకూల విధానాలపై అవగాహన కల్పించారు. నీతో డీలర్లో కొత్త ఉత్సాహం ప్రేరణ కలిగిందని తెలిపారు.



# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**- ఎమ్మెల్సీ దండే విఠల్**

**దహెగాం, జనవరి 12, ప్రభాతవార్త :**

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. దహెగాం మండల పెసరికుంట గ్రామ నూతనంగా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పెసరికుంట గ్రామ సర్పంచ్ సతీష్ కుమ్మరి, ఉప సర్పంచ్ అంకులు, వార్డు సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గ్రామంలోని సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చాడని గ్రామంలోని సమస్యలు తీర్చే విదంగా, గ్రామ అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు. గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని అభివృద్ధి పనులు జరగాలంటే కాంగ్రెస్ కె సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమం లో దహెగాం మండల మాజీ జడ్పిటిసి, ఆత్మ చైర్మన్ శ్రీ రామారావు, గిరవెల్లి సర్పంచ్, హత్తిని సర్పంచ్, పెసరికుంట గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

పనులు చూసే పార్టీలో చేరిన పెసరికుంట గ్రామ సర్పంచ్ సతీష్ కుమ్మరి పెసరికుంట గ్రామ (స్వతంత్ర ) సర్పంచ్ గా నన్ను గెలిపించిన నా గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు గ్రామ అభివృద్ధి నా లక్ష్యం గ్రామాన్ని అన్ని విధాలుగా అనేక రంగాల్లో అభివృద్ధి చేయడం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి పర్చుకుందాం.

## డిటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 12, ప్రభాతవార్త :**

డెమోక్రటిక్ ఫెడరేషన్ 2026 సంవత్సర క్యాలెండర్, డైరీ ని అసిస్టెంట్ ట్రెసరీ అధికారి పంకజ్ పాల్ , కాగజ్నగర్ మండల విద్యాశాఖ అధికారి వాసల ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం పని చేసే ఉపాధ్యాయుల సంఘం అని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన కరువు భత్యం మరియు పీఆర్‌సి వెంటనే ప్రకటించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ పి. నాందేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకులు దుర్గం విస్తారు, సభ్యులు రవీంద్రాచారి, దుర్గం మోహన్ పాల్గొన్నారు.




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ ట్రెసరీ అధికారి పంకజ్ పాల్, ఎంఈఓ ప్రభాకర్

## సిఆర్‌టీ ఉపాధ్యాయుల నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



**ఉట్నూర్, జనవరి 12, ప్రభాతవార్త :**

ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సి ఆర్ టీ ఉపాధ్యాయుల నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్, మర్మాట్, ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వినంత్ రావు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్నా సిఆర్‌టీ ఉపాధ్యాయుల వేతనాలు విడుదల చేసి, యంటీఎస్ అమలు అయ్యేల చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు రమేష్, శంకర్, విజేష్, బాపూరావు, నాగేష్, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాతన్‌పల్లి మున్సిపల్ తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన కమిషనర్

**- క్యాతన్ పల్లి ఓటర్ల సంఖ్య29,785 - పురుష ఓటర్లు14,761, మహిళా ఓటర్లు15023**

**రామకృష్ణాపూర్, జనవరి 12, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, అధికారులతో కలిసి విడుదల చేశారు. నూతన జాబితా ప్రకారం క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో మొత్తం ఓటర్ల సంఖ్య 29,785, పురుష ఓటర్ల సంఖ్య,14,761, మహిళా ఓటర్ల సంఖ్య 15,023, కాగా ఒక్కరు తృతీయ లింగ ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో మార్పులు, వార్డు మ్యాపింగ్ ఇతర లోపాలకు సంబంధించి ప్రజలు, ఓటర్లు రాజకీయ పార్టీల నుంచి తేదీ నుండి ఈ నెల 01నుండి 11 వరకు క్యాతన్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరించగా, మొత్తం 645 అభ్యంతర పిటిషన్లు (ఒకటి లేదా బహుళ అభ్యంతరాలతో) సమర్పించారు. స్వీకరించిన అన్ని అభ్యంతరాలను, నిబంధనలు మార్గదర్శకాల అనుగుణంగా పరిశీలించి పరిష్కరించారు. అనంతరం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి సంబంధించిన 22 వార్డుల వారీగా ఫైనల్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సిద్ధం చేసి క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో నోటిస్ బోర్డు పై ప్రచురించారుతుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 29,731 కాగా, అందులో పురుష ఓటర్లు 14,732, మహిళా ఓటర్లు 14,998, తృతీయ లింగ ఓటర్లు 1 గా ఉన్నారు. అదేవిధంగా, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పొందుపరిచిన 54 మంది ఓటర్లు ఇతర మున్సిపాలిటీలు / గ్రామ పంచాయతీలకు చెందినవారిగా, సంబంధిత బూత్ లెవల్ అధికారులు ఇచ్చిన చిరునామాలు, రాజకీయ పార్టీల అభ్యంతరాల ఆధారంగా గుర్తించడం జరిగింది. అందువల్ల, ఈ ఓటర్లను అన్‌మ్యాప్డ్‌గా గుర్తించి ఫైనల్ ఓటర్ల జాబితాలో చేర్చలేదు. ఈ విధంగా, ఫైనల్ ఓటర్ల జాబితాలో ఉన్న 29,731 మంది ఓటర్లు, అన్‌మ్యాప్డ్‌గా ఉన్న 54 మంది ఓటర్లు కలిపి మొత్తం 29,785 మంది ఓటర్ల సంఖ్యగా ఉంది.



## ఏజెన్సీ దళితుల హక్కులకై మరో పోరాటం

**- ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ మోరే**

**నార్నూర్, జనవరి 12, ప్రభాతవార్త:**

స్వాతంత్ర్యానికి పూర్వం నుండీ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో కలిసి జీవిస్తున్న షెడ్యూల్డ్ కులాల హక్కుల సాధనకై మరో పోరాటానికి సిద్ధపడాలని ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్ మోరే పిలుపునిచ్చారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న దళితులు భూహక్కులు లేక ఎన్నికల్లో రిజర్వేషన్ ఫలాలు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన అనేక సార్లు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన సమస్యల పరిష్కారం కావడం లేదని వాపోయారు. రాజకీయ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఏజెన్సీ దళితులు తమ హక్కుల సాధనకై సిద్ధం కావాలని అన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుర్గే కాంతారావును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు, ఝాడే నాగోరావ్, అనిల్ మోటే రావ్, షెడ్యూల్డ్ కులాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారమవుతోంది

**- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్**

**- బోథ్ నియోజకవర్గంలో మరో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం**

**సిరికొండ, జనవరి 12, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. సిరికొండ మండలం పొన్న గ్రామంలో షేక్ అహ్మద్‌కు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడు సొంతింటిలో సుఖంగా జీవించాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు స్థిరమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బోథ్ నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా అనేక మంది పేదల జీవితాల్లో మార్పు వస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, కళ్లెం నారాయణరెడ్డి, సిరికొండ మండల సర్పంచ్ బొడ్డుదత్తాత్రే, ఇచ్చోడ మండల సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, ఇమ్రాన్, నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తఫా, నియోజకవర్గ యువత అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

